
నూరేళ్ళ తెలుగు కథకు నవ్య నీరాజనం - 28



# ఇంగ్లీష్ సాహిత్య పరిచయంతో తెలుగు తెరమరుగయింది


## - ముక్తవరం పార్థసారథి

ఆయన కథా రచయిత. నవలా రచయిత. ప్రముఖ అనువాదకుడు. కథ అనగానే ముందుగా కథకులందరూ స్మరించే పేరు చెహోవ్. అలాంటి చెహోవ్ కథలను యాభైకి పైగా తెలుగులోకి అనువాదం చేసి సంపుటిగా తెచ్చింది కూడా ఆయనే. ఇప్పటి వరకూ 200కు పైగా కథలు, 15 నవలలు రాశారాయన. ఆంగ్ల సాహిత్యాన్ని ఔపోసన పట్టారు . 'రంగుల వల'తో నవలా ప్రపంచంలో అడుగు పెట్టి 'కలల నీడలు' ఆవిష్కరించి, కథా ప్రపంచంలో 'మిణుగుర్లు' వెదజల్లిన ముక్తవరం పార్థసారిధిగారితో ఇంటర్వ్యూ ఈవారం..

హైదరాబాద్‌లోని విజయనగర్ కాలనీలో ఉంటున్న ముక్తవరం పార్థసారధి గారింటికి నేనూ, మా ఎడిటర్ జగన్నాథశర్మగారు వెళ్లాం. మేం వెళ్లేప్పటికి ఆయన ఇంట్లో ఒక్కరే ఉన్నారు. వెళ్లగానే తనే టీ పెట్టి ఇచ్చారు. వాళ్ల ఇంటినిండా పుస్తకాలే! ఇంగ్లీషు పుస్తకాలే ఎక్కువ. మాకు ఇంట్లోకి కాకుండా లైబ్రరీలోకి ప్రవేశించినట్టే ఉంది. అన్ని పుస్తకాల సేకరణ వెనక, అన్ని కథలు రాయడం వెనక దాగి ఉన్న తన జీవితంలోని కఠిన సత్యాలను ఒక్కొక్కటీ ఆయన వివరించడం మొదలు పెట్టారు.

## నాకు రెండు నెలల వయసులో నాన్న పోయారు

మా అమ్మ చూడామణి, నాన్న వెంకటనరసయ్య. నేను 7 జులై 1944లో పుట్టాను. నేనొక్కడినే కొడుకును. నేను పుట్టిన రెండు నెలలకే నాన్న పోయారు. భువనగిరిలోని మా మేనమామ పాండురంగ స్వామి గారింట్లో పెరిగాను. నేనాయనను అంకుల్ అని పిలిచేవాడిని. భువనగిరిలోని స్కూల్‌లో మా అంకుల్ టీచర్. ఆయన భువనగిరిలో 'ఆంధ్రభాషానిలయం' ప్రారంభించారు. అప్పటికే యింట్లో మనుచరిత్ర, రామాయణంతో పాటు చాలా పుస్తకాలుండేవి. మనుచరిత్ర అర్థం కాకపోయినా చదివేవాడిని. శరత్ పుస్తకాలు కూడా ఇంట్లో ఉండేవి. వాటిని కూడా చదివాను. రోజూ చదువుకోవడంపైనే ఎక్కువ ఆసక్తి ఉండేది.


శ్రీమతి వసంతకుమారితో....

## నిక్కరేసుకునే కుర్రాడు రాస్తే బూతు కథే!

అప్పట్లో కథలన్నీ మద్రాసులోనే జరుగుతాయి అనుకునేవాణ్ని. నేను తొమ్మిదో క్లాసులో ఉన్నప్పుడు 1959లో అనుకుంటా 'గోల్కొండ' పత్రికలో నా మొదటి కథ 'స్వయంకృతాపరాధం' వచ్చింది. అది బూతు కథ కాదు కానీ, నిక్కరేసుకునే కుర్రాడు రాస్తే బూతు కథే! చక్కగా, బుద్ధిగా చదువుకునే కుర్రాడికి యిటువంటి ఆలోచనలు ఎందుకొస్తున్నాయి అని అంకుల్ నన్ను కొట్టాడు. 'రాస్తే పద్యాలు రాయాలి. వచనం రాయడం ఏమిటి?' అన్నారాయన. వాళ్లు ఉత్తరాలు కూడా గ్రాంథికంలో రాసుకునేవారు. 'వ్యవహారికంలో రాస్తే తెలుగెట్ల వస్తుంది?' అన్నారాయన.

అయితే అంకుల్ నన్ను తిట్టినా, కొట్టినా స్కూల్లో తన తోటి టీచర్లతో 'మా అల్లుడు కథ రాసినాడు సార్' అని గొప్పగా చెప్పుకున్నాడు.

## ఇంట్లోనించి చలం దగ్గరకు పారిపోయాను

పి.యు.సి. అయింది. మంచి మార్కులే వచ్చాయి. మా అంకుల్ అప్పటికే రిటైర్ అయ్యారు. చిన్నప్పటినుంచీ నేను వాళ్లింటిలో పెరగడం వలన అంకుల్ మా స్వంత మనిషి అనుకునే వాడిని. మాకూ, ఆయనకు మధ్య గ్యాప్ ఉంటుందని తెలీదు. ఆయన నన్ను చదివించాలి అనుకునేవాడ్ని. అప్పుడు ఇంత ఖర్చులు లేవు. చాలా సింపుల్ లైఫ్. బావి దగ్గర స్నానాలు. మజ్జిగ, అన్నం, చారు.. చాలంతే! అంకుల్ నన్ను చదివించకపోవడంతో వాళ్లమీద కోపం వచ్చింది. చలం దగ్గరకు పోవాలనుకున్నాను. నాంపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చాను. స్టేషన్లో చాలా సేపు నిల్చున్నాను. రైల్లో మద్రాసుకు పోయాను. అప్పుడు చలం తిరువణ్ణామలైలో ఉన్నారు. 'ప్రజామత' పత్రికలో 'ప్రశ్న జవాబులు' శీర్షికను చలం నిర్వహించేవారు. ఆ శీర్షిక ద్వారా అప్పటికే నాకు చలం పరిచయం. నేను వారి ఇంటికి వెళ్లాను. ఇంటిముందు అరుగుమీద చలం, నర్తకి, చిత్ర, సౌరిస్ కూర్చొని ఉన్నారు. నర్తకి నా కోసం బావిలోంచి నీళ్లు తోడి, గోలెంలో పోసింది. నా స్నానం అయ్యాక టవల్ ఇచ్చింది. ఇడ్లీలు పెట్టారు. తిన్నాను. మనం ఆయన పుస్తకాల గురించి ఎన్ని ప్రశ్నలు వేసినా చలం ఏమీ మాట్లాడేవారు కాదు. మా ఇద్దరి మధ్యా ఉత్తరాలు చాలా కాలం పాటు నడిచాయి. ఉత్తరం రాయడానికి నేను బద్ధకించేవాడినేమో కాని చలం గారి దగ్గరనుంచి, ఆయనకు ఉత్తరం చేరిన మూడోరోజే తప్పకుండా నాకు ఉత్తరం వచ్చేది. ఒకసారి రిప్లై ఇవ్వడానికి డబ్బులు లేవని, ఉత్తరంతోపాటు స్టాంపులు అంటించిన కవరు కూడా పంపమని రాశారు. కవరు పంపించాను. చివరిసారి చలం దగ్గరకు 1976లో వెళ్లాననుకుంటా. వాళ్లింట్లో వారం రోజులున్నాను. అక్కడ చేసేదేం లేదు. వాళ్లు ఏం చేయరు. 'ఈశ్వరుడు ఇస్తాడ్లే' అనేవాడు. నాకు దేవుడంటే నమ్మకం లేదు. ఈశ్వరుడెట్లిస్తాడు? తిరిగి మా ఇంటికొచ్చేశాను. 18 ఏళ్లు నిండితే ఉద్యోగం వస్తుంది. నాకప్పుడు 17 ఏళ్లే!


## రోజుకు రెండు మీల్స్ టిక్కెట్లు నా జీతం

హిమాయత్ నగర్‌లో 'స్వతంత్రపార్టీ' కార్యాలయం ఉండేది. దానిని భారతీదేవి, రంగా వాళ్లు నడుపుతున్నారు. ఒకరోజు ఉద్యోగం కోసం వాళ్ల ఆఫీసుకు వెళ్లాను. రంగాగారు లేరు. అక్కడ ఉన్నవారు నాకు ఉద్యోగం ఇచ్చారు. అక్కడ కూర్చుని ఫోన్‌కాల్స్ వస్తే రాసుకోవడం నా పని. రోజూ నారాయణగూడలోని హోటల్‌లో రెండు మీల్స్ టిక్కెట్లు ఇచ్చేవారు. అదీ నా జీతం. వారం తర్వాత రంగా వచ్చారు. 'యిది రాజకీయ పార్టీ ఆఫీసు. నువ్వు కుర్రాడివి. యిక్కడ ఉన్నావంటే గవర్నమెంట్ ఉద్యోగం రాదు. వెళ్లిపో' అని 5 రూపాయలు ఇచ్చారు. మళ్లీ అక్కడకు రావద్దని చెప్పారు. హవాయి చెప్పులు వేసుకుని ఉద్యోగం కోసం తిరిగే వాడిని. సుమారు 50 ఉద్యోగాలు చేసుంటాను. కొన్ని ఉద్యోగాలయితే ఒకటి రెండు రోజులకుమించి చేయలేదు. ఉద్యోగాలు వస్తుంటాయి, పోతుంటాయి. అంతే!

## రాత్రంతా అమ్మ ఏడుస్తూనే ఉంది

మా అమ్మకు, అక్కయ్య(అమ్మ అక్క)కు నేనంటే చాలా ప్రేమ. అంకుల్, ఆయన కజిన్ బ్రదర్, ఆయన భార్య, మేము కలిసి ఉండేవాళ్లం. అమ్మ ఆ ఇంట్లో వంట చేసేది. ఒక రోజు అమ్మ ఏదో దాచిపెట్టిందని వాళ్లకు అనుమానం వచ్చింది. అమ్మకు చిన్న ట్రంకుపెట్టె ఉండేది. అదే ఆమె ఆస్తి. దాన్నెవరూ ముట్టుకోకూడదు. మాటామాటా పెరిగి వారు అమ్మ ట్రంకుపెట్టెను తెరిచి చూశారు. అందులో ఏమీ దొరకలేదు. అయితే మానభంగానికి గురయిన స్త్రీ ఎంతగా ఏడుస్తాదో, ఆ ట్రంకుపెట్టెను తెరిచి చూసినందుకు అమ్మ అంతలా ఏడ్చింది. రాత్రి పన్నెండయింది. ఒంటిగంటయింది. అమ్మ ఏడుపు ఆపలేదు. మామూలుగా అంకుల్ అంటే నాకు చాలా భయం. ఆయన ముందు మాట్లాడాలంటే నత్తికూడా వచ్చేది. ఆ రోజు ధైర్యం చేసి యింట్లోంచి వెళ్లిపోతు

న్నామని చెప్పేశాను. అది 1962 డిసెంబర్ నెలనుకుంటా. తెల్లారనీ అన్నాడు అంకుల్. మెట్లమీదే కూర్చున్నా. మరుసటి రోజు మా కజిన్ బ్రదర్స్‌తో కలిసి ఇంటికోసం వెతికాం. చాదర్‌ఘాట్ దగ్గర ఒక ఇల్లు దొరికింది. మొత్తం ఆరు పోర్షన్లున్నాయి. సిటీలో కరెంటున్నది. ఆ ఇంటికి లేదు. ఆ ఇంటి వోనర్లకు కరెంటు ఏర్పాటు చేసుకునేంత స్థోమత లేదు. 6 ఇళ్లకు కలిపి ఒక్కటే లావెటరీ. దాని పక్కనే మా గది. అద్దె 9 రూపాయలు. ఆ మధ్యాహ్నం అమ్మా, అక్కయ్య నేను ఆ ఇంట్లోకి వచ్చేశాం. డబ్బుల్లేవు. దేశంమీద పడాల. ఎవరైనా మిత్రుడు కన్పిస్తే చాలు, రూపాయి, అర్ధరూపాయి, పావలా అడిగేవాడిని. కొందరు డబ్బు సాయం చేసేవారు. కొందరు భోజనం పెట్టేవారు.


పుస్తకాల ఆవిష్కరణ సభలో
కె.శివారెడ్డి, తెలకపల్లి రవితో...

## సోమర్‌సెట్ మామ్ పరిచయం అయ్యాక..

అప్పట్లో అర్ధరూపాయితో ముగ్గురికి రెండు పూటలా సరిపోయే తిండి వచ్చేది. పిండి మరలో మిగిలి పోయిన పిండి 10పైసలకు, మోతీ మార్కెట్‌లో 5పైసలకు పాలకూర, 5 పైసలకు బొగ్గులు తెచ్చుకుని వంట చేసుకునేవాళ్లం. అఫ్జల్ గంజ్ దగ్గర 'స్టేట్ లైబ్రరీ' ఉండేది. నాకు పనీ పాటా లేదు కదా. ఉదయం 8గంటలకు గేటు తీయకముందే పోయి అక్కడ కూర్చునేవాణ్ణి. అక్కడ ఇంగ్లీషు పుస్తకాలు ఎక్కువగా ఉండేవి. ఇంగ్లీషు పుస్తకాలు చదవడం మొదలయ్యాక, ఒక్కసారి సోమర్‌సెట్ మామ్ పరిచయం అయ్యాక యిక తెలుగు పుస్తకాలు కళ్లకు కనిపించలేదు. వాళ్లెంత చక్కగా రాస్తారో. తెలుగులో కొంతకాలం చదవగానే పుస్తకాలన్నీ అయిపోతాయి. కానీ ఇంగ్లీషులో అలాకాదు. ఎన్ని రోజులు చదివినా అయిపోవు. వారు కథకు సంబంధించి చాలా ప్రయోగాలు చేశారు.

## కథకు 30 రూపాయలిచ్చేవాళ్లు

ఒకటిన్నర సంవత్సరం నిరుద్యోగ పర్వం. ఆ సమయమంతా చదువుకుంటూ, ముష్టెత్తుకుంటూ గడిపేశాను. 'అభిసారిక' వాళ్లు నా కథ తీసుకున్నారు. 25 రూపాయలు పంపిస్తూ లీగల్ గొడవ ఉంటుంది మీరే చూసుకోవాలన్నారు. సరే అన్నాను. నాకేముందని?! 'ఆంధ్రపత్రిక' వాళ్లు 30 రూపాయలు పంపించేవారు. 'జయశ్రీ' వాళ్లు కూడా పంపేవారు.

## పరిగెత్తి పోయి శాస్త్రిగారితో మాట్లాడాను

మా అక్కయ్య బ్రెయిన్ హేమరేజ్‌తో చనిపోయింది. నాకు పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చింది. దాంతో మేము వేరే ఇంట్లోకి మారాం. రామడుగు రాధాకృష్ణమూర్తి మేమూ ఒకే చోట ఉండేవాళ్లం. మాకు ఆదివారం రాగానే అబిడ్స్ పోయి పుస్తకాలు చూడటం అలవాటుగా మారింది. నేను పోస్టాఫీసులో డ్యూటీలో ఉన్నాను. ఆ సమయంలో 'మైసూర్ కేఫ్'కు రావిశాస్త్రిగారు వచ్చారని తెలిసింది. ఆఫీసు మూసేటందుకు ఇంకా అరగంట టైముంది కాని నిల్వలేక పోయాను. క్లోజ్ చేసి పరిగెత్తి పోయి శాస్త్రిగారితో మాట్లాడాను. 'విశాఖ' అనే పత్రిక ప్రచురిస్తున్నారు. అందుకోసం భాట్టం శ్రీరామమూర్తిగారితో కలిసి శాస్త్రిగారు వచ్చారు.

'ఏం చదువుతున్నారు' అనడిగారు. 'చలంను చదువుతున్నాను' అన్నాను.

'చలంను ఎందుకు చదువుతావు? ఏం నచ్చింది? చెహోవ్‌ను, డికెన్స్‌ను చదువుకోవచ్చు కదా' అన్నారు. చలం మీద గౌరవం లేక కాదు! శాస్త్రిగారు ఆ సలహా ఇచ్చిన 20 ఏళ్లకు గాని వాళ్లను చదవలేదు. చెహోవ్ కథలను తెలుగులోకి అనువాదం చేశాను. ఒక సంకలనం కూడా తెచ్చాను. ఇక్కడ తెలుగు రచయితలకు రాస్తే పెద్దగా వచ్చేదీ లేదు, రాయకపోతే బాధలేదు. కానీ చెహోవ్‌కు రాస్తేనే బతుకు.

## 1969లో నా నవలకు మొదటి బహుమతి

హైదరాబాద్‌లోని 'మొహింజాహీ మార్కెట్లో' 'యుఎస్ఐఎస్' లైబ్రరీ ఒకటుండేది. అక్కడికెళ్లి పుస్తకాలు తెచ్చుకోవడం, విపరీతంగా చదవడం.. ఇదే పని. అప్పుడప్పుడు రాస్తూ ఉండేవాడిని. 'ఆంధ్రప్రభ' 1969లో ఉగాది నవలల పోటీ పెట్టారు. 'రంగుల వల' అనే నవల రాసి పోటీకి పంపించాను. అప్పుడే 'బైబిల్' అనే సినిమా వచ్చింది. అమ్మ నేను సరదాగా ఆ సినిమాకు వెళ్లాం. అది మూకీ సినిమా. సినిమా చూసేసి ఇంటికి వచ్చాక నా నవలకు మొదటి బహుమతి వచ్చినట్టుగా టెలిగ్రాం వచ్చింది. బహుమతి 5,500 రూపాయలు. మా అంకుల్‌కు ఈ సంగతి తెలిసి చాలా ఆనందించాడు. అప్పట్లో 5వేల రూపాయలకు 400గజాల ప్లాట్ వచ్చేది. మా అంకుల్ కొనమని చెప్పాడు. ఓహెన్రీ లైఫ్ ఆదర్శం కదా! తాగితే తప్పులేదు! అలా.. ప్లాట్ కొనలేదు. ఆ నవలతో శ్రీపతి, చంద్ర, రాజారామ్మోహనరావు పరిచయమయ్యారు.

## 200 కథలు, 15 నవలలు..

1971లో నాకు వసంతకుమారితో పెళ్లయింది. పెళ్లయ్యాక నారాయణగూడ షిఫ్టయ్యాం. మాకు ఇద్దరబ్బాయిలు. వికాస్, సందీప్. ఇద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు. డి.వెంకట్రామయ్య, చెరబండరాజు, బీనాదేవి, నరసింగరావు, చందుసోంబాబు.. వీళ్లంతా పరిచయం అయ్యారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌నుంచి రిజర్వ్ బ్యాంక్‌కు మారాను. 2002లో ఉద్యోగ విరమణ అనంతరం నా రచనలన్నింటినీ పుస్తకాలుగా వేశాను. ఇప్పటి వరకూ సుమారుగా 200 కథలు, 15 నవలలు రాశాను.

## అమ్మ చనిపోగానే రిలీఫ్‌గా అనిపించింది!

2003నుంచి అమ్మకు ఆరోగ్యం బాగలేకుండా పోయింది. అన్నీ మంచం పైనే. ఐదేళ్లపాటు అమ్మకు అన్ని అవసరాలూ నేనే చూసుకునే వాడిని. పొద్దున్నే హార్లిక్స్ కలిపివ్వడం, మధ్యాహ్నం భోజనం, సాయంకాలం స్నాక్స్, రాత్రి భోజనం, మాత్రలు ఇవ్వడం అన్నీ నేనే దగ్గరుండి చూసుకునేవాడిని. ఆ ఐదేళ్లూ మందు తాగడం మానేశాను. ఎందుకంటే మందుతాగి పడుకుంటే పొద్దున్నే నిద్రలేవడం లేటవుతుంది. అమ్మకు ఇబ్బంది. అందుకని. ఇక సభలూ, సమావేశాలకు కూడా వెళ్లడం మానేశాను. ఒకవేళ వెళ్లినా నా ప్రసంగం అయిపోగానే వచ్చేసేవాడిని. 16 నవంబర్ 2008న అమ్మ చనిపోయింది. ఎదురుగా అమ్మ బాడీ ఉంది. 'హమ్మయ్య.. ఇప్పుడు హార్లిక్స్ కలపక్కరలేదు' అనుకున్నాను. నాకు చాలా రిలీఫ్‌గా అనిపించింది.

-సుంకోజి దేవేంద్రాచారి

**నాకు నచ్చిన నా కథ**

# మిణుగుర్లు

**- ముక్తవరం పార్థసారథి**

**500 మంది పనిచేస్తున్న కంపెనీకి ఓ స్టాఫ్ కాంటీన్ వుండటం కనీసావసరం అంటే ఎవరికీ సందేహముండక్కర్లేదు. హోటళ్ళలో ధరలు ఎలా మండిపోతున్నాయో అందరికీ తెలుసు. అసలే చాలీచాలని జీతాలతో సంసారాలు నెట్టుకొస్తున్న ఉద్యోగులు ఈ బోడి జీతం యింట్లో పెళ్లాం పిల్లల మీదే ఖర్చు పెడతారా; బైట కాఫీ హోటళ్ళకే తగలేస్తారా?**

కాని మేనేజిమెంట్లన్నింటికీ ఓ జబ్బుంటుంది. అది మాయరోగం అడిగిందాకా ఏదీయివ్వరు. ఆ అడగటమేనా అలా యిలా కాదు. 'అయ్యా, బాబూ, పేదవాళ్ళం మేంబైట ఉడిపిలో టిఫిన్లు, కాఫీలు భరించలేం స్టాఫ్ కాంటీన్ పెట్టించండి' అంటో దయగా, జాలిగా అడిగితే యిస్తారా? ఊహూఁ అలా యిస్తే చులకనైపోరూ! ఉద్యోగులు తమక్కావలసిన ప్రతీ చిన్న అవసరం కోసమూ అలజడి చేయాల్సిందే. ఆ అలజడి తారస్థాయికి చేరాల్సిందే. అప్పుడు గాని అడిగిందాంట్లో సగమో, పావో యివ్వరు. చివరికి కర్ర విరగదు. పాము చావదు. సమ్మెలన్నీ అంతే. కార్మిక-యాజమాన్య సంబంధాలు అంతే .

ఈ 500 మంది సభ్యులున్న అతి మిలిటెంటు యూనియన్ కూడా అదే చేసింది.

కాంటీన్ లేకపోవటం వల్ల వుద్యోగులెదుర్కొంటున్న ఆర్థిక యిబ్బందులు ఏకరువు పెడుతూ, కాంటీన్ అవసరాన్ని నొక్కి చెబుతూ మేనేజిమెంటుకు లాంఛనప్రాయంగా వుత్తరం రాసినప్పుడు వాళ్ళకు తెలుసు - ఇవి చదువుకోగానే మేనేజిమెంటు కాంటీన్ ప్రారంభించదని.

ఓ నెలాగి మరో ఉత్తరం

తర్వాత అల్టిమేటం

ఫలాని తేదీలోగా కాంటీన్ ప్రారంభించకపోతేం (ఏం చేస్తారు? మేనేజిమెంటు కూడా యిలాగే అనుకుంది, ఏం చేస్తారో చూద్దామని...)

ఆ ఫలాని తేది గడిచిపోయింది.

యూనియన్ వాళ్ళు సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. మేనేజిమెంటు తమ న్యాయ సమ్మతమైన కోర్కెను తీర్చటం లేదు గనక యిక సహాయ నిరాకరణ తప్పనిసరి అని.

'మీ బోడి సహాయం ఎవడిక్కావాలి, మా మాన్యువల్సూ, రూల్సూ, రెగ్యులేషన్సూ వుండటం వల్ల మీరు పని చేస్తున్నారు గాని మాకు సహాయంచెయ్యాలని కాదు' అనుకొని మేనేజిమెంటు వాళ్ళు, సహాయ నిరాకరణ నోటీసును చెత్తబుట్టలో పారేశారు.

తరవాత టూల్ - డౌన్ స్ట్రైక్.

'ఫీక్ ఫ్రై. గో అ హెడ్' అన్నది మేనేజిమెంట్.

ప్రదర్శనలు.

నోటీసులు.

ఛాలెంజ్‌లు

చివర్న - సమ్మె

కార్మిక- యాజమాన్య సంబంధాలను పర్యవేక్షించే ప్రభుత్వాధికారి కూడా వచ్చి కలుగ చేసుకున్నాడు.

మూడు రోజుల సమ్మె తర్వాత సంభాషణలు ప్రారంభమయ్యాయి. మొదట సమ్మె మానితే గాని సంభాషణలు ప్రారంభం కావన్నారు మేనేజిమెంటు. 'అమ్మమ్మో, ఇప్పుడు సమ్మె విరమించుకుంటే, మళ్ళీ యింతమందిచేత సమ్మె చేయించటం చాలా యిబ్బంది' అన్నారు యూనియనిస్టులు.

ఆ అనిశ్చిత వాతావరణంలోనే సంభాషణల్లాంటివి జరిగాయి. తాడో, పేడో తేలకుండా ఒప్పందాల్లాంటివి కుదిరాయి. ఈ ఒప్పందాల భాష ఎలా వుంటుందంటే అటు మేనేజిమెంటు, వాళ్ళూ, యిటు యూనియన్ వాళ్ళు కూడా ఎవరిక్కావలసిన అర్థం వాళ్ళు తీసుకోవచ్చు. కాని ఎవరు మాత్రమేం చెయ్యగలరు! ఒప్పందాల భాష ఎప్పుడూ అలాగే వుంటుంది.

మేనేజిమెంటు ఆర్థిక పరిస్థితిని సమాలోచించి, త్వరలో (ఎప్పుడు?) కాంటీన్ గురించి ఓ నిర్ణయం తీసుకోటానికి సుముఖంగా వుంది. కాని మొదట దేశ ఆర్థిక పరిస్థితుల దష్ట్యా, ఉత్పత్తి లక్ష్యాల దష్ట్యా సమ్మె విరమించుకోవాలి. 'నో వర్క్ - నో వేజెస్' పద్ధతి ప్రకారం సమ్మె కాలానికి జీతం అడక్కూడదు. ఐతే ఈ సమ్మె కాలాన్ని యింక్రిమెంటు వాయిదా వెయ్యటానికి పరిగణించరు. సమ్మెలో పాల్గొన్న వాళ్ళకు ఛార్జిషీట్లివ్వరు. క్రమశిక్షణోల్లంఘనకు చర్య తీసుకోరు. ఈ సమ్మె మూలంగా వచ్చిన ఉత్పత్తి నష్టాన్ని పూరించటానికి ఉద్యోగులు సంపూర్ణ సహకారాన్నిందిస్తారు.

-అదీ ఒడంబడిక.

ఇది చాలా మిలిటెంట్ యూనియనని చెప్పాను గదా - వాళ్ళు ఆ తర్వాత కూడా మేనేజిమెంటును వూపిరి పీల్చుకోనివ్వలేదు. ఉద్యోగులకు జీతాల్లో కోత రాకుండా, మేనేజిమెంటుకు చిన్న చిన్న యిబ్బందులనేకం కలిగించి 'న్యూసెన్సు' సృష్టించారు - పక్కవాణ్ణి గిల్లి ఏమీ ఎరగనట్టుగా కూర్చుంటారే, అలాగ, వాళ్ళడగలేరు. వీళ్ళు చెప్పరు. కాని ఇద్దరికీ తెలుసు, ఎవరేమీ చేస్తున్నారో, పోట్లాడటం సులభం కాని శతకకారుడు చెప్పినట్టుగా కంటిలో నలుసు, చెవిలో జోరీగ, చెప్పులో రాయిలాగ మారితే తీసెయ్యటం కష్టం. అందువల్ల మేనేజిమెంటు వాళ్ళు ఒప్పందంలో ఏమీ స్పష్టంగా లేకపోయినా నెల తిరక్కుండానే కాంటీన్ గురించి నిర్ణయం తీసుకొన్నారు. లాంఛనంగా యూనియన్‌ను కూడా ఆహ్వానించారు. వివరాలు పద్ధతిక్రమం మాట్లాడటానికి, తర్వాత యూనియన్ నాయకులు చెప్పాలిగా తమ సభ్యులకు - మమ్మల్ని పిలిచి, మాట్లాడి మరీ నిర్ణయం తీసుకొన్నారని.

కాంటీన్ సహకార పద్ధతిలో వుంటుంది. అంటే కాంటీన్‌కు ఉద్యోగులే యజమానులు. కాంటీన్ పెట్టటానికి స్థలం, బల్లలు, కుర్చీలు, పొయ్యిలు, వంట పరికరాలు, పాత్రలు, కప్పులు, సాసర్లు, ప్లేట్లు వగైరా అన్నీ మేనేజిమెంటు యిస్తుంది. అదికాక మొత్తం కాంటీన్ ఖర్చులో సగానికి మేనేజిమెంటు 'సబ్సిడీ' కూడా యిస్తుంది. అంటే ఉద్యోగులకు తినుబండారాలన్నీ సగం ధరకే దొరుకుతాయి. కాని ఉద్యోగులు కాంటీన్ ఆవరణను పాడు చెయ్యకూడదు. అక్కడ అల్లర్లు, గొడవలు సృష్టించకూడదు. కంపెనీ ఆవరణలోనే కాంటీన్ వుండటం అదనుగా తీసుకొని వుద్యోగులు అక్కడ బాతాఖానీ కొడుతూ కాలం వృధా చెయ్యకూడదు. ఈ కాంటీన్ నడపటంలో వచ్చే ఎలాంటి యిబ్బందులకు గానీ, నష్టానికి గానీ (ఒకవేళ వస్తే) మరే కోర్టు పేచీలకు గానీ మేనేజిమెంటు బాధ్యత వహించదు.

మేనేజిమెంటు: ఓ.కే?

యూనియన్: ఓ.కే

మేనేజిమెంట్ అండ్ యూనియన్ - (ఏక కంఠంతో) - థాంక్యూ. వి. అషూర్ యూ ఆఫ్ అవర్ బెస్ట్ కో ఆపరేషన్.

తర్వాత కూల్ డ్రింక్స్.

## 2

కాంటీన్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌గా వుండటానికి యూనియన్ వాళ్ళు ఎన్నికలు

పెట్టుకున్నారు. పని కుర్రాళ్ళను అప్పాయింట్ చేసుకున్నారు. 'ఆఫ్టరాల్, మేం కూడా కార్మికులం సాటి కార్మికులకు వీలైనంత లాభం చేద్దాం' అనుకుని ఆ కుర్రాళ్ళకు ఓ పూట భోజనం, రెండు మూడుసార్లు కాఫీలు, టిఫిన్లు, నెలకు అరవై రూపాయలిచ్చి మరీ పనిచెయ్యమన్నారు.

మూడు కాఫీలూ, ఆరు టీలూ అంటూ కథ సుఖాంతం కావాలిక్కడ.

కాని – కాంటీన్ వచ్చిన సంవత్సరానికి, కుర్రాళ్ళు సణుగుడు మొదలెట్టారు.

''సార్, మా యిల్లు చాలా దూరం సార్. బొలారం నించి రావాలె. రాను పోను రోజుకు రూపాయిన్నరైతది సార్. అరవై రూపాయలు సరిపోవుసార్''.

''ఓరి అత్యాశ వెధవా, ఇంతోటి ఉద్యోగానికి నిన్ను బొలారం నించి ఎవర్రమ్మన్నార్రా – అక్కడే యిలాంటిదేదో చూసుకోక పోయావా?''

''ఎవరిస్తర్సార్?''

''మరింకేం ఈ మాత్రం నౌకరీ కూడా ఎక్కడా దొరకని రోజుల్లో. ఎవడికీ జీతాలు సరిపోతున్నాయని . ఈ రోజుల్లో – ఇన్ని వందలొస్తున్నాయి, మాకు సరిపోతున్నాయా?''

''సార్, మేం రెండు పూటలా యిక్కడే తింటం సార్''.

''ఊc, నువ్వొక్కడివే ఏం ఖర్మ, యింటిల్లిపాది వచ్చి యిక్కడే తినండీ. ఇది ధర్మ సత్రమై పోయింది. ఒరేయ్, మీరు దోచుకోటానికి మేమే కనిపించామా – ఆశకు హద్దుండాలి. పొద్దున్న పీకలదాకా మెక్కుతారు. ఇక ఎన్ని టిఫిన్లు మాయం చేస్తారో, ఎన్ని టీ, కాఫీలు తాగతారో లెక్కలేదు. ఇంకా ఏం కావాల్రా, మీలాంటి వాళ్ళకు వుద్యోగాలిస్తే యిలాగే నెత్తికెక్కుతారు''.



''సార్సార్''

''పోరా ఫో''

కాంటీన్ కుర్రాళ్ళు కూడా ఓ యూనియన్ లాంటిది పెట్టుకున్నారు. ఓనాడు కాంటీన్ వర్కర్స్ యూనియన్ సెక్రటరీ వచ్చి, కాంటీన్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌తో మాట్లాడేడు.

''సార్, జీతం పెంచాలె. కనీసం పది రూపాయలు. డెబ్బై చెయ్యిండ్రి''

డైరెక్టర్స్ జోక్స్ వేసుకున్నారు.

''ఏమోయ్, ఈ కామ్రేడు మన దగ్గర పాఠాలు నేర్చుకుంటున్నాడా, మనకే చెబుతున్నాడా?''

''యథారాజా తథాప్రజా''

''మనం మేనేజిమెంటును, టెర్రరైజ్ చేసినట్లుగా వీళ్ళు చెయ్యగలరా?''

''ఓరేయ్, కామ్రేడూ, నీ మిలిటెన్సీకి మెచ్చాం. నీ డిమాండ్ న్యాయ సమ్మతమైనదే. మీకు పదేం, వందకావాలన్నా పెంచుతాం. మాకు వస్తున్నంత జీతం నీకూ రావాలని డిమాండ్ పెట్టినా కరెక్టే. కాని, ఇదిగో బుల్లికామ్రేడూ, ఈ కాంటీన్ మేం ఎందుకోసం పెట్టుకున్నామో మొదట తెలుసుకో. బైట హోటళ్ళ ధరలు భరించలేకనే గద. ఏదో, కంపెనీ సబ్సిడీ యిస్తోంది గనక కాస్త చవగ్గా తినగలుగుతున్నాం. ఇప్పుడు నువ్వడిగినవన్నీ యిస్తే కాంటీన్‌లో రేట్లు పెరుగుతాయి. అప్పుడు మేం కాంటీన్ పెట్టుకున్న ప్రయోజనమే పోతుంది. అందువల్ల బ్రదరూ, అత్యాశకు పోయి బంగారు గుడ్లు పెట్టే బాతును చంపకు. ఈ వర్గ సమాజంలో, ఈ దోపిడీ వ్యవస్థలో జీతాలు ఎవరికీ, ఎంతకూ సరిపోవు. ఇచ్చే వాడికి తీసుకునే వాడూ, తీసుకునే వాడికి యిచ్చేవాడూ దోపిడీ దార్లుగా కనిపిస్తారు.''

కాంటీన్ వర్కర్స్ యూనియన్ సెక్రెటరీకి చదువురాదు. అతడికి అంతర్జాతీయ కార్మికోద్యమ చరిత్రగానీ, కనీసం మన దేశంలోని కార్మిక సంఘాల పరిణామం గానీ, అవి సాధించిన ఘన విజయాలు గానీ తెలియవు. అతడికి తెలిసిందల్లా తన తోటి కార్మికులకు అరవై రూపాయల జీతం సరిపోవటం లేదనీ, మరో పది పెంచితే బావుంటుందనీ. అక్కడితో సమస్య పరిష్కారమవుతుందా? అతడేమీ అలాంటి భ్రమలుండే అవకాశం లేదు. నిరక్షరాస్యుడైన అతడి ఆర్గ్యుమెంటు కూడా క్రూడ్‌గానే వుంటుంది.

''సార్సార్, ఏమైతదిసార్, చాయ యిప్పుడు మీకు పదమూడు పైసలు పడ్తది. ఇంకొక్క రెండు పైసలు పెంచుండి. టిఫిన్ల వల్ల గూడ ఒక్క రెండు మూడు పైసలు పెంచుండ్రి.''



''ఆc ఆc, వీడు ఎకనమిక్సు చెబుతున్నాడు''

''బాబూ, నీ తెలివైన వాదనకు సంతోషించాం. రేట్లు పెంచటమంటే నీకంత సులభంగానే కనిపిస్తుంది గాని''

''ఇంతింత జీతాలొస్తయి. రెండు పైసలు పెంచితే ఏమైతది సార్.''

''ఏమీ కాదు కామ్రేడ్, కాంటీన్ పెట్టుకున్న ప్రయోజనం పోతుంది''.

''సార్''

''కామ్రేడూ, మేం నీకు చండశాసనుల్లా కనిపిస్తే ఈ బోడి డైరెక్టర్ల పోస్టులకు యిప్పుడే రాజీనామా యిస్తాం. మళ్ళీ ఎలక్షన్లు పెట్టిస్తాం. అప్పుడు కొత్త బోర్డుతో మాట్లాడండి.. మీకు తెలుసుగా, మేమంతా మా మెంబర్లకు, అంటే కాంటీన్ షేర్ హోల్డర్లకు జవాబుదారీగా వుంటాం. వాళ్ళకు లాభం జరిగే పనులే మేం చెయ్యాలి నీకో చిన్న కిటుకు చెబుతాం. టైం తీసుకుని వెళ్ళి మా సెక్రటరీతో మాట్లాడు. అప్పుడేమన్నా పని జరిగే అవకాశముంటుంది.

ఆ సాయంత్రం యూనియన్ సెక్రటరీని కాంటీన్ సెక్రటరీ కలుసుకున్నాడు.

ఎన్నెన్నో వుద్యమాలు నడిపి, కార్మికుల హక్కులకు, వారి ప్రయోజనాలకు ఎంతో లాభం చేకూర్చినవాడు, ఈనాడు ఈ కంపెనీలో పని చెయ్యటమే ఓ వరం అనుకుంటున్నారంటే దానిక్కారణం ఈ సెక్రటరీ చేసిన త్యాగాలు, ధీరోదాత్తుడు. ఉద్యమాలు, అలజడులు నడిపించడంలో అతడికున్న చతురత, తెలివితేటలు, కన్విక్షన్, ఎత్తుగడలు – అతడికి తన సభ్యుల నాడీ, మేనేజిమెంటు ఆయువు పట్లు గూడా తెలుసు.

మరి, అలాంటి యూనియన్ సెక్రటరీని, పట్టుమని పది మంది సభ్యులు (తనతో కలిపితే పదనుకుంటా) కూడా లేని ఈ కాంటీన్ సెక్రటరీ కలవటానికొచ్చాడు.

విజ్ఞాపన విని, యూనియన్ సెక్రటరీ యిలా ఉపదేశించాడు.

''కామ్రేడ్ మీ డిమాండ్ చాలా న్యాయ సమ్మతమైనది. నాకూ ఆ డబ్బులు యివ్వాలనే వుంది. కాని నేను మా సభ్యుల బాగోగులు చూడ్డానికి ఎన్నుకోబడ్డాను. వాళ్ళ ప్రయోజనాలకు నష్టం చేసే పని ఏదీ చెయ్యను. మొదట కాంటీన్‌లో తినుబండారాల ధరలు నిర్ణయించేటప్పుడే మీ జీతాలు, అవసరాలు అన్నీ లెక్కలోకి తీసుకున్నాం. అసలు మొదట మా మెంబర్లు టీ ధర పది పైసలకే పెట్టమన్నారు. కాని నేనే మీ గురించి ఆలోచించి పదమూడు పైసలకు తక్కువ వుండొద్దన్నాను. ఇప్పుడు కాంటీన్ అమ్మకాలు పెరిగాయి. ఖర్చులు, జీతాలు, నడిపే పద్ధతి అంతా ఓ దారిన పడింది – ఇప్పుడిప్పుడే కాంటీన్ కాస్త నిలదొక్కుకుంటోంది. నిజానికి ఇప్పుడు కాంటీన్‌లో ధరలు తగ్గాలి. మరి, మీరేమో పెంచమంటారు, ఎలా వీలుపడుతుంది చెప్పు''

''రెండు పైసలేగదా సార్''.

''ఎన్ని పైసలని కాదు. అసలు రేట్లు పెరగకూడదు. తగ్గాలే తప్ప''

''రెండు పూటల తిండి''

''ఎందుకయ్యా బాబూ, నన్ను యిలా యిబ్బంది పెడతావు. ఏ మాత్రం వీలున్నా నేనే చెయ్యనూ. అఫ్టరాల్, సాటి కార్మికులం, మిమ్మల్ని మేం దోచుకుంటామా, వీలు పడదు. అస్సలు వీలు పడదు సారీ''

సర్వశక్తివంతుడైన ఆ సెక్రటరీ బాబే కాదన్న తర్వాత యింక తన మొర ఎవ్వరూ వినరని కాంటీన్ సెక్రటరీకి తెలిసిపోయింది.

తెల్లారి, పని తర్వాత, మిగతా తొమ్మిది మంది కుర్రాళ్ళు కూడా కలిసి కాంటీన్ ముందరి లైట్లు స్తంభం కింద సర్వసభ్య సమావేశం జరిపారు.

''ఏం రా, ఏమంటరు? మీరు నెత్తురు గక్కుకుని సచ్చినా సరే, పైస పెరగదట''

''స్ట్రైకు చేద్దాం. చాయలేకపోతే వాల్లు పనెట్ల చేస్తరు? రోజుకు పదిసార్లు చాయ తాగెటోల్లు''

''అగ్వ ఒచ్చినయని, బగ్గ టిఫిన్లు తిని బలిశిన్రు''

''వాల్లైతే స్ట్రైకులు చేసి బెదిరిస్తరు. వాల్లెప్పుడు పని చేస్తన్రా, ఎప్పుడు సూసినా కాంటీన్లనే సస్తరు, చాయ కావాలె, కాఫీ కావాలె, దోశ గావాలె, పకోడి కావాలె అంట''

''మరి వాల్లు ఎల్లగొడ్తె ఎట్లరా? ఇంకెవర్నన్న పెట్టుకుంటె మన నోట్లో మన్ను వడ్తదిగద''

''ఎహె. ఎందుకెల్లగొడ్తరోశి. వాల్లు నౌకర్లు చేస్తలేరా ఏం, వాల్లను ఎల్లగొడ్తున్రా? మంచితనంగ అడిగితె ఎవ్వరియ్యర్రా''

''వాల్లేమొ పని చెయ్యకుంట తిర్గుతరు. మల్ల యాడాదికి మూడు నెలల సెల వులు. మందులు ఫ్రీ. ఇంకా అలవెన్సులు, అడ్వాన్సులు–''

''వాల్లను సూశి ఏడిస్తె ఎట్లరో–''

''ఇచ్చే ఈ జీతాలే ఎక్కువైనయని వాల్లేడుస్తలేరా?''

''ఏమో, నేనైతే స్ట్రైకు చెయ్య. మనం చేస్తే వాల్లకేమైతది''

''అరె లంజకొడక, అందరం చేస్తమంటె నువ్వొక్కనివి చెయ్యనంటావు. కాల్లిర గ్గొడ్తం''

''నాక్కూడా చెయ్యొద్దనే వున్నది గని, మీ కోసం చేస్త''

''ఆఁ, మాకు మెహర్బాని చేస్తున్నావు, బాడకావు''

కాంటీన్ వర్కర్లు స్ట్రైక్ నోటీసిచ్చారు. డైరెక్టర్లు నవ్వుకున్నారు. నోటీసైతే యిచ్చారు కాని, వర్కర్లు భయపడ్డారు. మళ్ళీ బ్రతిమాలేరు. బామాలేరు. కాళ్ళు పట్టుకున్నంత పనిచేశారు.

''నోటీసిచ్చి వెనక్కు తగ్గకూడదు కామ్రేడ్. అది రివల్యూషనరీ స్పిరిట్ కాదు. మార్చ్. జీనా హైతో మర్నా సీఖో ఖదం ఖదం సే లడ్నా సీఖో'' అంటో డైరెక్టర్లు హితవు చెప్పారు.

గడువు తేది వచ్చింది. భయంతో, చీలికలతో, అపనమ్మకంతో సమ్మె జరిగింది. కంప్లీట్ స్ట్రైక్. కాంటీన్ తలుపులు మూతబడ్డాయి. చిన్న గుడ్డముక్క మీద ఎర్రగా యూనియన్ పేరు – ముష్టి పదిమందైనా లేనివాళ్ళ యూనియన్‌కు డబ్బులెక్క ణ్ణించి వస్తాయి, బ్యానర్లు, లౌడ్ స్పీకర్లు, బాడ్జీలు, కరపత్రాలు తెచ్చుకోవటానికి.

''మేనేజిమెంట్ డౌన్ డౌన్'' అన్నారు.

'న్యాయమైన కోర్కెలు వెంటనే తీర్చా'లన్నారు.

కాని యాజమాన్యాన్ని తిట్టటానికి భయం.

అదే ఉద్యోగులైతే బ్రహ్మాండంగా తిట్టగలరు. వాళ్ళు నినాదాలిస్తే కంపెనీ ఆవ రణ ప్రతిధ్వనిస్తుంది. గోడలు అదిరిపోతాయి. బోర్డ్ రూంలో కూర్చున్న బడా బూర్జువాలకు చెమట పడుతుంది. ఆ సెక్రటరీ మాటలు, వుపన్యాసం నిప్పు రవ్వలు. మషీన్ గన్ ఫైర్. ఫిరంగి గుళ్ళు.

ఉద్యోగులు సమ్మెకారులను చూసి నవ్వేరు.

సిగ్గు విడిచి సమ్మెకారులు తిరిగి నవ్వేరు.

ఉద్యోగులు పక్కనే వున్న ఉడిపినీ, ఇరానీనీ పాట్రనైజ్ చేశారు.

''పద. ఇదీ మన మంచికే జరిగింది. కాంటీన్ కూడు తిని బోర్ కొట్టింది'' అను కున్నారు.

కాంటీన్ వచ్చిన ఈ యాడాదిలోనూ గిరాకీ తగ్గిన ఆ ఉడిపి, ఇరానీ హోటళ్ళ వాళ్ళు తమ కస్టమర్ల నాకర్షించటానికి అనేక ఎత్తులు వేశారు. సీటింగ్, ఇంటీరి యర్ డెకొరేషన్ మార్చారు. టిఫిన్లు రుచిగా చేశారు. ఉద్యోగులు ఖాతా పెట్టొచ్చ న్నారు. అప్పటికే ఈ ఆకర్షణలకు సగం మొగ్గు చూపిన ఉద్యోగులకు ఇదో మంచి అవకాశంగా దొరికింది.

కాంటీన్ వర్కర్లకు ఆ హోటళ్ళ ప్రొప్రయిటర్ల తలలు పగల కొట్టాలనీ, అక్కడి సీట్లు చింపెయ్యాలని, యూనిఫాములు వేసుకునే ఆ సర్వర్ల కాళ్లూ చేతులు విరగొ ట్టాలనీ అనిపించక పోలేదు. కాని ముష్టి పదిమంది. అసలు ఈ ఉద్యోగులూ, హోటళ్ళ వాళ్ళూ కలిసి తమ మీద ఏదన్నా ప్రాక్టికల్ జోక్ వేస్తున్నారా, నాటక మాడుతున్నారా, జాయింటుగా దోచుకుంటున్నారా అని కూడా వాళ్ళనుకునే వుంటారు. కాని చేతకాని వెధవలు ఏమనుకుంటేనేం, లోపల ఎంత కోపం దాచు కుంటేనేం.

డబ్బులు ఖర్చుపెట్టని లోభులు తప్ప, కాంటీన్ మూసి వున్నందుకు ఎవరూ బాధ పడలేదు. ఉద్యోగులే లంచి టైముకు కాంటీన్ తెరిచారు. కంపెనీ స్వీపర్ వచ్చి వూడ్చి వెళ్ళాడు. ఇంటి నించి తెచ్చుకున్న టిఫిను మాత్రం అక్కడ తిని, హోటల్ కాఫీ తాగేరు.

సమ్మెకారులకిది అవమానంగా తోచింది.

రెండో రోజు.

''కాంటీన్ అసలు తెరవ్వద్దు సార్'' అన్నారు.

ఉద్యోగులు నవ్వేరు.

''ఇంకేం చేస్తార్రా?'' అన్నారు.

అంట్ల వెధవల్ని విదిలించి కొట్టినట్లుగా మాట్లాడేరు. పరిహసించేరు. రోడ్డు మీద జంగ్లీగాళ్ళకు నౌకరీ యిస్తే కతజత లేకుండా యిలాగే మాట్లాడతారన్నారు.

తమ యజమానులందరికీ మూల విరాట్టు యూనియన్ సెక్రటరీ అని కాంటీన్ కుర్రాళ్లకు తెలుసు. అతనితో మరోసారి అర్జీ పెట్టుకోవటానికి వెళ్లారు.

యూనియన్ సెక్రటరీ వాళ్ళ మేనేజిమెంటుతో బై పార్టైట్ నెగోషియేషన్స్‌కి వాళ్ళ ఎండితో మాట్లాడ్డానికి కంపెనీ ఖర్చుతో, ప్లేనులో, బొంబాయి వెళ్ళే సన్నా హంలో వున్నాడు. పక్కన యిద్దరు అసిస్టెంట్లున్నారు.

'ఇప్పుడు మాట్లాడ్డానికి వీలు పడదు. తర్వాత రమ్మ'న్నాడు.

'లేదు సార్. స్ట్రైక్ చేస్తున్నాం. ఇప్పుడే మాట్లాడాల'న్నారు స్ట్రైకర్లు.

సెక్రటరీ నవ్వాపుకోలేక పోయాడు.

''సారీ, మీ సమ్మెను చులకన చెయ్యటం నా వుద్దేశం కాదు. కాని ఎందుకో, మీరు 'స్ట్రైకు' అనేటప్పటికి నవ్వాగలేదు'' అన్నాడు అపాలజెటిక్‌గా.

''సార్సార్, ఎంతో కొంత పెంచండి. పది కాకపోతే ఎనిమిది''

''వాటెషేమ్. అప్పుడే అట్లా దిగుతారేమిట్రా నాయనా. మరో నాలుగు రోజులు చేయండి. చూద్దాం. మేం ఎన్నెన్ని రోజులు చేశాం. ఎన్ని రిస్కులు తీసు కున్నాం. ఎన్ని త్యాగాలు చేస్తే మాకీ మాత్రం దొరుకుతున్నవీనాడు. మీరింకా ఓన మాలు కూడా దిద్దలేదు, కార్మిక పోరాటాల్లో. అన్నీ వెండి పళ్ళెంలో పెట్టి మరీ యివ్వాలంటారు, ఊఁ– 'సెక్రటరీ గారు మళ్ళీ ఎల్లుండి తిరిగొస్తారు. అప్పుడు ఆలోచిద్దాం'' అన్నాడో అసిస్టెంట్.

''ఇయ్యాళ కూడ తిండి లేదు సార్''

''అవును మరి, మీరే వండుకొని తినాలి గద, ఎందుకు వండుకోలేదూ? స్ట్రైక్ చేస్తే మేనేజిమెంటుకే గాదు, మనక్కూడా కష్టాలొస్తాయని తెలుసుకోండి'' అంటో యూనియనిజం బోధించాడు సెక్రటరీ.

''సార్, మీరింత ఆలోచించేదేముంటది సార్, జెర జాలిపడండి. మాకు మీ అంత అనుభవం లేదు. బలం లేదు. పదిమందిమేమిజేస్తం సార్, కూలోళ్ళం. మీ ముందలి పిల్లలం. మీరు దయజూపిస్తే, చాయి, కాఫీ ఒక్క పైస పెంచితే ఏమైతాది సార్, డివిడెండ్ కొంచెం తగ్గుతది. మాకో పది రూపాయలు పెరుగుతది''

''అబ్బ. ఈ బోడి ప్రాబ్లమ్స్ నా దగ్గరెందుకు తెస్తారు?'' అంటో సెక్రటరీ తన అసిస్టెంట్ల వైపు చూశాడు.

## కథాంతరంగం



నేను బ్యాంకులో పనిచేసేవాణ్ణి. నాకెందుకో లెఫ్టి స్టులంటే గౌరవం ఉన్నప్పటికీ ఎక్కడో ఏదో తిరకాసు ఉందని అపనమ్మకం. అనుకున్నంత బాగా జరగవు కదా పనులు. బ్యాంకు వారు మాకు అన్ని సౌకర్యాలు ఇస్తారు. మేం ఎక్కడికి పోవాలన్నా మేనేజ్‌మెంట్ ఫ్లైట్ టికెట్ ఇస్తుంది.

మా బ్యాంకు యూనియన్ చాలా స్ట్రాంగ్. మేము, మా ఎంప్లాయిస్ అవసరం కోసం కో–ఆపరేటివ్ క్యాంటీన్ పెట్టుకున్నాం. ఈ క్యాంటీన్‌లో అన్నీ చాలా చవక. మేమందరం అక్కడ తింటుండేవాళ్లం. మా యూనియ న్‌కి సెక్రటరీ ఎలా ఉంటాడో, క్యాంటీన్ వాళ్లకూ సెక్రటరీ ఉన్నాడు. ఒకసారి క్యాంటీన్ వాళ్లు జీతాలు పెంచమని అడిగారు. మాకు 800, 900 పెంచ మని డిమాండ్ చేస్తాం. ఇంచుమించు కోరినంత ఇస్తారు. మేం బిజీగా ఉన్న సమయంలో క్యాంటీన్ సెక్రటరీ వచ్చి జీతం పది రూపాయలు పెంచమని మా సెక్రటరీని అడిగాడు, పిచ్చి వెధవ. మా సెక్రటరీ బిజీ. జీతం పెంచం. ఏం చేసుకుంటావో చేసుకో! పో! అన్నాడు. 'మేం కూడా స్ట్రైక్ చేస్తాం' అన్నాడు వాళ్ల సెక్రటరీ. మేం నవ్వుకున్నాం. క్యాంటీన్ వాళ్లు స్ట్రైక్ చేశారు. మాకెవ్వరికీ చీమకుట్టినట్టయినా లేదు. క్యాంటీన్‌లో అర్ధరూపాయితో గడి చేది. మా బ్యాంకు పక్కనే కామత్ హోటల్ వుంది. అక్కడ పది రూపా యలు పెట్టి అయినా తినగలం. తిన్నాం కూడా. వాళ్లకు బాగా యిబ్బంది అయిపోయింది. 'మేమూ కమ్యూనిస్టులం రా. మాతో పెట్టుకుంటారా. పుస్తకాలు రాసింది మేం. పద్ధతులు చెప్పేది మేం. మా ముందు స్ట్రైక్ చేస్తారా' అన్నాం. అప్పుడీ కథ రాశాను.

–ముక్తవరం పార్థసారధి
9177618708

''నేను మన టాక్స్ గురించే ఆలోచించనా, ఈ పది రూపాయల గురించీ, పైసల గురించీ ఆలోచించనా?'' అన్నాడు చిరునవ్వూ చిరాకూ జోడించి.

''ఏయ్, బాబూ, చాల్చాలు. ఏదో నీతో కామ్రేడ్‌లీగా వుంటే మరీ అలుసు తీసుకుంటున్నావు. సెక్రటరీ గారు బిజీగా వున్నారు. అయినా, ఆయనేం చేస్తాడు, మీ డైరెక్టర్ల నడుగు ఫో!''

''సార్సార్, అందరికీ పెద్ద మీరు. ఆ డైరెక్టర్లు మిమ్మల్నడగమంటరు. మీరు చెప్పితే అందరు వింటరు''

''నో. నో. ప్రతీదానికీ ఓ పద్ధతుంటుంది. వాళ్ళ ఫీల్డులోకి నేను వెళ్ళను. వాళ్ళ నిర్ణయం ఏదైనా నేను గౌరవిస్తాను. వాళ్లకు నేను కూడా ఓటు వేశాను. డెమోక్రసీలో ప్రజా ప్రతినిధులు ప్రజలకు జవాబు. వాళ్ళు మాకు జవాబు దారీ.''

''వాల్లు వినరు సార్''

''అంటే రేట్లు పెంచటం మెంబర్లకిష్టం లేదన్న మాట. అంతే. మీరంటే ఎంత సానుభూతి వున్నా, మీ డిమాండ్ ఎంత న్యాయసమ్మతమైనా, మా కాంటీన్ షేర్ హోల్డర్ల ప్రయోజనానికి, యిష్టానికీ వ్యతిరేకంగా ఏమీ చెయ్యలేం.

ఇది కో ఆపరేటివ్ కాంటీన్. ఉద్యోగులే దీని షేర్ హోల్డర్లు. వాళ్ళకు డివిడెండ్ కావాలి. టిఫిన్లు చవగ్గా కావాలి. అందుకోసమే మేం అన్నాళ్ళు పోట్లాడాం. మరి ఆ త్యాగాల ఫలితాన్ని ఈనాడు వృధాచేస్తే 'ఇందుకోసమా స్ట్రైక్ చేసింది?' అంటారు మెంబర్లు. అందువల్ల ఇది వీలుపడదని మరోసారి చెబుతున్నాను. పైగా యిలాంటి విషయాల్లో నిర్ణయాలు తీసుకోవాలంటే, కాంటీన్ షేర్ హోల్డర్ల మీటింగ్ జరగాలి. అక్కడీ విషయం చర్చకు రావాలి. మెజారిటీ అందుకొప్పుకోవాలి. అప్పుడు గాని ఏమన్నా జరగదు'' అన్నాడు సెక్రటరీ విషయాలు విశదం చేస్తూ.

కాంటీన్ సెక్రటరీ క్కోపమొచ్చింది. వాడు మాట్లాడలేదు.

''మేం పది మంది అసహాయులమనేగా మీరిలా మాట్లాడుతున్నది'' అనుకున్నాడు. కానీ అది కనిపిస్తూనే వుంది. మాటల్తో మారతారా మనుషులు? దీనాలాపాలకు, ప్రార్థనలకు, మంచి మాటలకు ఏ మేనేజిమెంట్లూ లొంగవు. కార్మికులను సంతోష పెట్టటం ఏ మేనేజిమెంటు ధ్యేయమూ కాదు.

యూనియన్ సెక్రటరీ గారు బొంబాయి కెగిరిపోయారు.

కాంటీన్ కుర్రాళ్ళ సమ్మె కొనసాగింది – ఉద్యోగులు నవ్వేరు.

''లేవండ్రా వెధవల్లారా'' అన్నారు.

కుర్రాళ్ళు లేవలేదు. అంతేగాక, 'లేవం సార్' అని కూడా అన్నారు.

వాళ్ళ చింకిగుడ్డ జెండా తీసి పక్కన పారేశాడు డైరెక్టర్.

''దాదాగిరీ బంద్ కరో!'' అన్నాడో కుర్రాడు. అది వాడు వీళ్ళనోటే విన్నాడు.

ఉద్యోగులక్కోపమొచ్చింది.

''జులాయి వెధవా, మమ్మల్నిరా అలాంటి మాటలనేది!'' అంటో ఆ కుర్రాడి జుట్టు పట్టుకొని పక్కకీడ్చేశాడో ఉద్యోగి.

మంచి జీతాలతో, మంచి భోజనంతో, కాంటీన్‌తో తక్కువ ధరకు, ఎక్కువ టిఫిన్లు తిని ఆరోగ్యం పెంచుకొన్న వుద్యోగులు ఆ కుర్రాళ్ళను పక్కకు నెట్టడం – అందునా ముష్టి పదిమంది అర్ధాకలి అస్థిపంజరాలను, ఇంకా వోటు హక్కుకూడా రాని కుర్రాళ్ళను తోసెయ్యటం యిక్కడ రాయవలసినంత ముఖ్య విషయం కాదు. ఓ మరి చిన్న కుర్రాడేడ్చేశాడు. మిగతా వాళ్ళు కన్నీళ్ళాపుకున్నారు. మొహాలు జేవురించాయి. సిగ్గు మాలిన వెధవలు, మళ్ళీ, ''దాదాగిరి బంద్‌కరో!'' అన్నారు, తన్నులు తింటున్నారనే స్పృహైనా లేకుండా, అవమానాన్ని సహించని వుద్యోగులు వాళ్లను కంపెనీ ఆవరణ బైట పారేశారు.

''వెధవల్లారా, మిమ్మల్ని తిండికి మాడ్చి చంపాలి. మీకు జీతాలెక్కువై వొళ్ళు బలిశాయి. దొంగ తిండ్లతో కొవ్వెక్కారు. మళ్ళా ఈ గేటు లోపల కాలుపెడితే జాగ్రత్త. ఈ సారికి క్షమించాం. మళ్ళీ పేలారో నాలిక చీరేస్తాం. తోళ్ళు ఒలిచేస్తాం. జుట్లు పీకేస్తాం. సున్నంలోకి ఎముకలు మిగలకుండా తంతాం. కాళ్లూ చేతులూ విరిచేస్తాం. ఇంట్లో చెప్పొచ్చినార్రా లంజకొడుకుల్లారా, రేపొద్దున్న మీకన్నా పది రూపాయలు తక్కువకే అదే మహాప్రసాదమన్నట్టుగా వచ్చే కుర్రాళ్ళు లక్షల మంది వున్నారు. వెళ్లండి. మళ్లీ యిటు ఛాయలకి రాకండి. హ్హాహ్హాహ్హా'' అన్నారు కోపం వచ్చిన వుద్యోగులు.

తుంటరి వెధవలు కాలికి బుద్ధి చెప్పారు. తన్నులు బాగా తగిలిన వాళ్ళు కుంటుతూ పరిగెత్తారు. ఒకడు వూడిపోయిన పంటిని తీసుకొని జేబులో వేసుకున్నాడు. ఒకడికి ముక్కులో నెత్తురొస్తే, మరొకడి చెయ్యి రాత్రికి అన్నం కలుపుకోనియ్యలేదు. ఆ సెల్ఫ్ స్టైల్డ్ సెక్రటరీ గాడికి తల పగిలినంత పనైంది. గూబమీద తగిలిందేమో, రాత్రంతా చెవిపోటు కూడా వచ్చింది.

''ఇలా వొదిలెయ్య కూడదు వెధవల్ని. మనకు నేర్పిస్తారా పోరాటంలో పాఠాలు!'' అనుకున్నారు వుద్యోగులు.

బొంబాయి నుండి తిరిగి వచ్చిన యూనియన్ సెక్రటరీకి విషయం తెలిసింది.

''కొట్టారా వాళ్ళను?'' అన్నాడు.

''వాళ్లను మనం కొట్టాలండీ, పిచ్చుక మీద బ్రహ్మాస్త్రమెందుకు! ఊరికే చెయ్యి చూపిస్తానే పారిపొయ్యారు పిరికి పందలు – కాని ఇదే మంచిపనిలెండి – మన మీద మరీ అలుసు తీసుకున్నారు. వెధవలు. ఈ మాత్రం భయంలో పెట్టాలి వీళ్ళను. ఎందుకూ, మీ బాయ్స్ మంచి డెసిషన్ తీసుకున్నారు. నిన్ననే వాళ్లందరికీ జీతాలిచ్చి పంపేశారు. అప్పుడే కొత్త కుర్రాళ్ల అప్పాయింట్ మెంట్స్ కూడా జరిగిపోయాయి. చాకుల్లాంటి వాళ్ళు. ఈ సంవత్సరం మనకు డివిడెండ్ మరో ఐదు శాతం పెరిగింది''

ధరలు పెరగనందుకూ, డివిడెండూ పెరిగినందుకూ, షేర్ హోల్డర్లు సంతోషించారు. కాని కార్మికోద్యమాల చరిత్రా, గతి తార్కిక భౌతికవాదమూ తెలిసిన ఆ సెక్రటరీ కూడా సంతోషించాడని నేను చెప్పలేను. సాంఘిక న్యాయం జరిగిందో లేదో కూడా అతనికి తెలియక పోలేదు.

కాని ఆచరించలేని మంచి అభిప్రాయాల వల్ల ఎవరికి మాత్రమేం ప్రయోజనం కలుగుతుంది? బడా పెట్టుబడిదార్లను గజగజలాడించే ఆ మిలిటెంటు ఉద్యోగుల ముందు కాంటీన్ కుర్రాళ్ళు చిత్తుగా ఓడిపోయారు.

''హంసే జో టక్ రాయేగా
మిట్టీమేc మిల్ జాయేగా''
ప్రస్తుతానికది వుద్యోగుల నినాదం.

*

## ప్రియమణి, తరుణ్‌ల పెళ్ళి?



జాతీయ అవార్డు గ్రహీత ప్రియమణి, లవర్‌బాయ్ తరుణ్‌లు పెళ్లి చేసుకోబోతున్నట్లు పరిశ్రమలో జోరుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. విశాల్, జీవన్, పృథ్వీరాజ్‌లతో ప్రేమాయణాలు జరిపిన ప్రియమణి ప్రస్తుతం తరుణ్‌తో తన 'బంధాన్ని' మరింత సుస్థిరం చేసుకోవాలనుకుంటోందని పలువురు అంటున్నారు. తెలుగు సినిమా 'నవ వసంతం' చేస్తున్నప్పుడే వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించిందని, అది ఇప్పుడు ఫలించబోతోందని చెబుతున్నారు. ఈ విషయాన్ని ప్రియమణి, తరుణ్ ఇద్దరూ ఇంతవరకూ ధృవీకరించలేదు. ప్రియమణి మాత్రం ఈ విషయాన్ని ఖండించింది. తరుణ్ తనకు మంచి స్నేహితుడే తప్ప, పెళ్ళి చేసుకోవాలనే ఆలోచన లేదని స్పష్టం చేసింది. రోజారమణి కొడుకుగా తరుణ్ అంటే తనకు చెప్పలేనంత అభిమానం అని కూడా అంటోంది. ప్రస్తుతానికి తనకు కెరీర్ తప్పించి మరిదేని మీదా దృష్టి పెట్టే టైము లేదు అని స్పష్టం చేస్తోంది.